క్లుప్తంగా

అభ్యసనా సామగ్రి వితరణ


అభ్యసనా సామగ్రి అందిస్తున్న ఎంఈఓ, దాత

నగరి : మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బాలమురుగన్ స్టోర్స్ యజమాని రాధాకృష్ణ విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన ఆయన ఎంఈఓ నమశ్శివాయం ద్వారా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతను అభినందించారు. దాత సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యాపరంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కవిత, పీసీ చైర్మన్ వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం బారులు


ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ముందు క్యూ కట్టిన జనం

నగరి : గ్యాస్ పుస్తకాలను తీసుకెళ్లి ఈకేవైసీ చేసుకోవడానికి వినియోగదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. వెలుగు పథకంలో ఉన్నవారికే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్న ప్రచారం ఊపందుకోవడంతో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ముందు వినియోగదారులు క్యూకడుతున్నారు. కొన్ని గంటల పాటు వేచి ఉండి మరీ ఈకేవైసీ చేసుకుని వస్తున్నారు.

శ్రీనివాసులుకు సన్మానం


శ్రీనివాసులు రెడ్డిని సన్మానిస్తున్న డీసీసీబీ సీఈఓ, బ్రాంచ్ మేనేజర్

గంగాధర నెల్లూరు: మండలకేంద్రంలోని సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జ్ అధికారి ఎస్.శ్రీనివాసులు రెడ్డిని ఆ శాఖ అధికారులు, డీసీసీబీ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. గత జూన్ 28వ తేదీన శ్రీనివాసులు రెడ్డి పర్సన్ ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సొసైటీ సీఈఓ విజయ్‌కుమార్ రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ బ్యాంకు మేనేజర్ మహేష్, సూపర్‌వైజర్ విజయ, సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ మునుస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం


చిత్తూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే 'విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బుధవారం జిల్లాలోని డివిజన్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సమస్యలపై మొత్తం 79 ఫిర్యాదుల అందాయని, వాటిలో 14 సమస్యల్ని పరిష్కరించామన్నారు. మిగిలిన వాటికి ఆర్థికపరమైన సమస్యలతో ముడి పడి ఉన్నాయని, వాటికి అనుమతులు తీసుకుని పరిష్కరిస్తామన్నారు. బిల్లింగ్ సమస్యలు 14, కేబుల్, కరెంటు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు..ఇత్యాది సమస్యలపై వినతులు వచ్చినట్లు వివరించారు. చిత్తూరులో ఫిర్యాదులను ఈఈ మునిచంద్ర స్వీకరించారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో బహుళ ప్రయోజనాలు

- రసాయన ఎరువులతో నిర్జీవంగా మారుతున్న భూములు
- కోళ్ల పెంటతో నేలకు, పంటలకు మేలు
- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న అధికారులు


ఉద్యాన తోటలకు వేయడానికి పశువుల ఎరువును ట్రాక్టర్‌లోకి నింపుతున్న దృశ్యం, (ఇన్‌సెట్) లోకేష్, ఉద్యానశాఖ అధికారి, జీడీనెల్లూరు

కార్వేటినగరం: అధిక దిగుబడులను ఆశించి రైతులు విచక్షణా రహితంగా రసాయన పురుగుల మందులు వాడడం వల్ల భూములు నిర్జీవంగా మారుతున్నాయి. బహుళ ప్రయోజనకారులైన సూక్ష్మజీవులు నశించడం వల్ల వాటి ద్వారా లభించే సేంద్రియ పదార్థాలు, సూక్ష్మ పోషకం పదార్థాలు పూర్తిగా అదృశ్యమవుతున్నాయి. దీని వల్ల మొక్కల్లో పెరుగుదల నశిస్తుంది. ఉద్యాన పంటల్లో సమగ్ర యాజమాన్యాన్ని రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ముఖ్యంగా ఉద్యాన పంటల్లో 50 శాతం సేంద్రియ, 50 శాతం రసాయన ఎరువులు వాడితే మంచి దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి లోకేష్ సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువులు అంటే..

సేంద్రియ ఎరువుల్లో పశువుల ఎరువు, మేకలు, గొర్రెలు ఎరువు, వర్మీకంపోస్టుతో పాటు కోళ్ల పెంట ప్రముఖమైనవి. వీటిల్లో మొక్కలకు కావాల్సిన ప్రధాన పోషకాలైన జింక్, మెగ్నీషియం, మాంగనీస్, బోరాన్ తదితరాలు మొక్కలకు దొరుకుతాయి. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక సేంద్రియ ఎరువు కోళ్ల ఎరువు మాత్రమే. కోళ్ల ఎరువులో ఎక్కువ మొత్తంలో నత్రజని, 3శాతం, భాస్వరం 2.5 శాతం, పొటాష్ 1.2 శాతం ఉంటాయి. ఉద్యాన పంటలైన కూరగాయల పంటలకు ఎకరానికి 500 కేజీల కోళ్ల ఎరువు సరిపోతుంది. ఈ ఎరువును రసాయన ఎరువుతో కలిపి వాడితే 20 నుంచి 25 శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు.

పచ్చికోళ్ల ఎరువు వద్దు..

పచ్చికోళ్ల ఎరువును ఎట్టి పరిస్థితుల్లో మొక్కలకు వేయరాదు. దానిలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల వేరు వ్యవస్థ మాడిపోయి మొక్కలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే కోళ్ల ఎరువును సేకరించాక బాగా మాగిన తరువాత మొక్కలకు వేసుకోవాలి. ఒక టన్ను కోళ్ల ఎరువుకు 15 కేజీల సూపర్ పాస్ఫేట్ కలిపితే తొందరగా కుళ్లిపోతుంది. కోళ్ల ఎరువును సాధారణంగా మొక్కలు నాటడానికి 20 రోజుల ముందుగా వేయాలి.

కోళ్ల పెంటను ఎంత మోతాదులో వాడాలంటే..

పామాయిల్ తోటలకు –	6 ఏళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టు
కొబ్బరి –	8 ఏళ్ల వయసున్న కాపు కాసే చెట్లకు 30 నుంచి 50 కేజీలు, ఎకరానికి 5 టన్నులు
మామిడి –	10 ఏళ్ల కాపు కాసే చెట్టుకు 50 నుంచి 70 కేజీలు
జీడిమామిడి –	7 ఏళ్ల వయసున్న కాపు కాసే చెట్టుకు 40 కేజీలు
నిమ్మ, బత్తాయి –	6ఏళ్ల వయసున్న కాపుకాసే చెట్టుకు 30 కేజీలు
బొప్పాయి –	ఎకరానికి 3 నుంచి 5 టన్నులు
మిరప –	ఎకరానికి 3 టన్నులు
పూలతోటలకు –	ఎకరానికి 2 టన్నులు

పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం : ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేయాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి, డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం సింహరాజుపురంలో జరుగుతున్న 104 వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు టీకాలను సక్రమంగా వేయాలని తెలిపారు. బిడ్డకు, బిడ్డకు మధ్య మూడేళ్ల అంతరం పాటించాలన్నారు. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గర్భిణులు ఎక్కువగా పండ్ల రసం, మజ్జిగ తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, విస్తరణాధికారి రమేష్, ఏఎస్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గంగమ్మ కొలుపు



భక్తులను ఆకట్టుకునేలా ఆలయ ఆవరణలో అమ్మవారి చిత్రాన్ని తీర్చిదిద్దిన దృశ్యం, పొంగుపాలు తోడుతున్న భక్తులు

కార్వేటినగరం: మండల పరిధిలోని ఎగువరాజుల కండ్రిగ గ్రామంలో వెలసి ఉన్న శ్రీకారేటిగంగమ్మ ఆలయంలో కొలుపు వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్ప మాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో అమ్మవారి చిత్రాన్ని రంగవల్లులతో చూపరులను ఆకట్టుకునే విధంగా అర్చకులు తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారి చిత్రంపై కర్పూరాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే యాదవుల ఆనవాయితీ ప్రకారం వేడివేడి పాలను(పొంగుపాలు) చేతులతో తోడి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే అమ్మవారి కొలుపును పురస్కరించుకుని హరికథా కాలక్షేపం చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు కొలుపు కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకోవడం విశేషం.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు


గాడి తీయించిన అధికారులు

పుత్తూరు: ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు బుధవారం తగిన చర్యలు చేపట్టారు. నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ గ్రామం మీదుగా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి దారికి అడ్డంగా జేసీబీ సాయంతో పెద్ద గొయ్యి తీయించారు. దీంతో ఈ మార్గం గూండా ట్రాక్టర్లు, టిప్పర్ల రవాణాను అదుపు చేసినట్లేనని ఎస్ఈబీ సీఐ ఉరుకుందమ్మ తెలిపారు. అనంతరం ఇద్దరు ఐడీ ముద్దాయిల నుంచి రూ.10 వేలు వంతున ఉల్లంఘన మొత్తాన్ని వసూలు చేశామన్నారు. ఈనెల 1వ తేదీన అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం సివిల్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు.

ప్రోటోకాల్ పాటించండి


మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు: ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులైన తమను ఆహ్వానించాలని, లేనిపక్షంలో ప్రోటోకాల్ ఉల్లంఘన కింద జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ మునివేలు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ, సర్పంచులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలను, సర్పంచులను, ఎంపీటీసీలను అధికారులు అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

భక్తి ప్రపత్తులతో ప్రదోష పూజలు


విశేష అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం భక్తిప్రపత్తులతో ప్రదోషకాల పూజలు జరిగాయి. ఈ సందర్భంగా శివుడికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశుని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పాలాభిషేకం అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందికి పసుపు, కుంకుమ, పాలు, పెరుగుతో అభిషేకం చేశారు. పూలతో అలంకరించిన తరువాత ప్రదోష పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సత్యమ్మ దేవత

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏటూకూరిపల్లె గ్రామంలో వెలసిన బాటగంగమ్మకు, కేజే పురం గ్రామంలో వెలసిన సత్యమ్మ దేవతకు గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలితో నయ్యాడి వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం పాల బిందెలను మహిళలు ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అంబలి, తీర్థప్రసాదాలను పంచి పెట్టారు.


పంబవాయిద్యాలతో అంబలి, పూజాసామగ్రిని ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

రైతుకు పరిహారం పంపిణీ

- చెక్కును అందజేసిన కలెక్టర్


జగన్నాథంకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పెనుమూరు మండలం ఎల్లంపల్లెకు చెందిన రైతు జగన్నాథంకు రూ.35 వేల నష్టపరిహారాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అందజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో బాధిత రైతుకు కలెక్టర్ చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల జగన్నాథం పండించిన నేరేడు పంట, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అగ్నిప్రమాదంలో దెబ్బతిన్నాయన్నారు. బాధిత రైతును ఆదుకోవాలని పెనుమూరు తహసీల్దార్ కలెక్టరేట్‌కు నివేదికలు పంపారని, పరిశీలించిన అనంతరం ఆ రైతుకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఫండ్) నుంచి రూ.35 వేలు ఆర్థిక సహాయం చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


చికిత్స అందిస్తున్న డాక్టర్లు చంద్రశేఖర్, తిరుమురుగన్

పుత్తూరు: అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో కెవ హెర్బల్ ఆయుర్వేదిక్ ఆధ్వర్యంలో డాక్టర్లు చంద్రశేఖర్, తిరుమురుగన్ వైద్యులు అందించారు. జపాన్ టెక్నాలజీ ద్వారా మ్యాగ్నటిక్ థెరపీ హెల్త్ చెకప్ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన బ్రాంచి కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు 99490 51900 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హేమాద్రి, యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు గణేష్‌బాబు, వేలాయుధం, వెంకటేశ్వరరావు, పాలసీదార్లు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ ఆర్ఐగా సుధాకర్

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో ఆర్మ్డు రిజర్వ్ (ఏఆర్) విభాగం ఆర్ఐగా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నీలకంఠేశ్వరరెడ్డి ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో.. హోంగార్డ్స్ ఆర్ఐగా పనిచేస్తున్న సుధాకర్‌ను ఏఆర్ ఆర్ఐగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసుల పార్కింగ్ షెడ్డు ప్రారంభం


వాహనాల షెడ్డు ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఆర్మ్డు రిజర్వు కార్యాలయంలో పోలీసుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన పార్కింగ్ షెడ్డును బుధవారం ఎస్పీ మణికంఠ ప్రారంభించారు. అనంతరం బ్యాండు సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్ బాషా, ఇలియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నీట్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరగాలి

- నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవితవ్యం అంధకారమైంది
- విద్యార్థులకు నష్టం కలిగించేలా కేంద్రప్రభుత్వం తీరు
- నేడు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్
- జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల పిలుపు


ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న విజయ్‌కుమార్


ఎంఈఓ కార్యాలయం వద్ద విద్యార్థి సంఘ నాయకులు

నగరి : దేశవ్యాప్తంగా గురువారం చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని కోరుతూ నగరి మండల విద్యాశాఖ అధికారికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం ఐక్య విద్యార్థి సంఘంతో పాటు ఎంఈఓను కలిసిన ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌కుమార్ బంద్ ఆవశ్యకతను ఎంఈఓకు తెలియజేశారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. తీవ్రమైన అవకతవకలు చోటు చేసుకుందన్నారు. బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని తెలిపారు. నీట్ పరీక్ష లీకేజీపై తెరవెనుక కుంభకోణంపై కేంద్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నామన్నారు. అన్నీ విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు బాషా, రోహిత్, కామరాజు,ముని, విశాల్, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుగూళ్ల ఉత్పత్తి పెంపునకు చర్యలు

- రైతులు, రీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి
- ఆరోగ్యశ్రీ నిధులతో అవసరమైన పరికరాలు కొనండి
- ఆస్పత్రిలో ఖాళీ పోస్టులపై ఉన్నతాధికారుల దృష్టికి
- రోగులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం
- పట్టుగూళ్ల కేంద్రం, ఏరియా ఆస్పత్రుల తనిఖీలో కలెక్టర్ సుమిత్ కుమార్


పలమనేరులోని పట్టుగూళ్ల మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పలమనేరు: జిల్లాలోనే ఎక్కువగా పట్టుగూళ్ల ఉత్పత్తికి పేరున్న పలమనేరు ప్రాంతంలో మరింతగా వాటి ఉత్పత్తులను పెంచేందుకు పట్టుపరిశ్రమశాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. పట్టణ సమీపంలోని పట్టుగూళ్ల మార్కెట్, రీలింగ్ యూనిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడి పట్టురైతుల సమస్యలను, అనంతరం రీలర్లతో మాట్లాడి పట్టుదారం ధరలను తెలుసుకున్నారు. రీలర్లకు అవసరమైన ఏర్పాట్లను చేయడానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ ప్రాంతం పట్టు పురుగుల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఉన్న నేపథ్యంలో రైతులకు మరింత ప్రోత్సాహకం అందివ్వాలన్నారు. దీనిపై మరింత అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెరికల్చర్ జేడీ శోభారాణి, స్థానిక ఏడీ కిశోర్‌నాయక్, మార్కెట్ అధికారి అనిల్‌కుమార్, గ్రైనేజ్ ఇన్‌చార్జ్ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ఏరియా ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

ఏరియా ఆస్పత్రి తనిఖీలో..

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అన్ని వార్డుల్లో పర్యటించారు. రోగులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆస్పత్రికి అవసరమైన కొన్ని పరికరాలు కావాలని వైద్యులు కోరారు. నవజాత శిశువులకు అవసరమైన వార్మర్స్, ల్యాబ్ రీ–ఏజెంట్స్, ఆపరేషన్ థియేటర్‌లో బాయిల్ ఆపరేటర్లు లేవని వైద్యులు నివేదించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. ఆరోగ్యశ్రీ నిధులతో వాటిని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే దీనికిగాను అత్యవసర సాయంగా కలెక్టర్ నిధుల నుంచి రూ.2లక్షలను మంజూరు చేశారు. ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్యుడు, ఎముకల డాక్టర్, చర్మవ్యాధి నిపుణులు, ఫిజీషియన్, రేడియాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడుతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.